క్లుప్తంగా

నేటి నుంచి హేలాపురి బాలోత్సవం



బాలోత్సవం సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): హేలాపురి బాలోత్సవం 5వ పిల్లల సంబరాలు ఈనెల 23 నుంచి 26 వరకు వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో బాలోత్సవం నిర్వహిస్తామని ఆహ్వాన సంఘం చైర్మన్ ఆడుసుమిల్లి నిర్మల, అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన బాలోత్సవం సన్నాహక కార్యక్రమంలో వారు మాట్లాడారు. 2019 నుంచి హేలాపురి బాలోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హేలాపురి బాలోత్సవానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్దల నుంచి అపూర్వమైన స్పందన వస్తుందన్నారు. 69 అంశాల్లో నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించే వేదికగా బాలోత్సవం కొనసాగుతుందని తెలిపారు. 23న ఉదయం 10 గంటలకు కరెన్సీ నోట్లు, ఫాన్సీ కాయిన్స్, మోటివేషన్ ఎగ్జిబిషన్‌తో బాలోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీఓ కృష్ణారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రహదారి ప్రమాదాల నివారణకు ప్రజలకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కలిగించాలని రోడ్ సేఫ్టీ వలంటీర్లకు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా కేంద్ర రవాణా, జాతీయ రహదారులు, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం ద్వారా రోడ్‌సేఫ్టీ వలంటీర్లుగా ఎంపికైన వారికి బుధవారం స్థానిక ఉపరవాణా కమినర్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వలంటీర్లుగా ఎంపికై న వారు ముందుగా రహదారి భద్రతా నియమాలు తెలుసుకోవాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా ప్రజలను, వాహన చోదకులను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ప్రాంతీయ రవాణా అధికారి కృష్ణారావు, ఎంవీఐ ఎస్‌బీ శేఖర్, ఏఎంవీఐలు ఎండీ జమీర్, పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞ, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, నెహ్రూ జిల్లా యువజన అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో భద్రతపై ఆందోళన

- రాత్రి, పగలు గస్తీ బాధ్యత పట్టించుకోని అధికారులు
- సీసీ కెమెరాల నిఘాపై పర్యవేక్షణేదీ ?

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా కేంద్రంలో సర్వజన ఆసుపత్రిలో భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఏలూరు మెడికల్ కళాశాలకు అనుబంధ బోధనాసుపత్రిగా వర్గోన్నతి పొందినా హాస్పిటల్ పాలనపై నీలినీడలు అలముకున్నాయి. ఒకవైపు హాస్పిటల్ ప్రాంగణంలో మోటారు సైకిళ్ల చోరీలు, మరోవైపు హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బందిపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. జీజీహెచ్ ప్రాంగణంలో చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా పర్యవేక్షణ బాధ్యత ఎవరు నిర్వర్తిస్తున్నారనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్స్ ఏర్పాటు చేశారు. వందలాది మంది విద్యార్థినులు భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై మెడికల్ కళాశాల, జీజీహెచ్, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

భద్రతా చర్యలపై సందేహాలు

జీజీహెచ్ ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్స్ భవనాలు నిర్మిస్తుండగా.. తాత్కాలికంగా ఎంసీహెచ్ భవనంపై ఏర్పాటు చేశారు. ఇక జీజీహెచ్ భవనంలోనే ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినుల హాస్టల్ ఉంది. ఈ రెండు హాస్టల్స్‌లో రెండు వందలకు పైగా మెడికల్, నర్సింగ్ విద్యార్థినులు వసతి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లో జీజీహెచ్‌లో భద్రతా చర్యలపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. హాస్పిటల్‌లోకి రాత్రివేళల్లో మద్యం సేవించి అనేకమంది ఇష్టారాజ్యంగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొందరి చేతుల్లోనే పెత్తనం

జీజీహెచ్‌లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన కొందరు వ్యక్తుల చేతుల్లో ఉండిపోవటంతో వారు చెప్పిందే వేదంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. శానిటేషన్, సెక్యూరిటీ పర్యవేక్షణ బాధ్యత హాస్పిటల్ ఉన్నతాధికారుల చేతుల్లో ఉండాల్సి ఉండగా, మరో వ్యక్తి రాజకీయ నేతల అండదండలతో పెత్తనం చెలాయిస్తూ అధికారులను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చొని ఎవరు ఏమి చేస్తున్నారో చూస్తూ, వైద్య సిబ్బందితో పాటు శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని వేధింపులకు గురిచేస్తారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై హాస్పిటల్ ఉన్నతాధికారులు సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణపై దృష్టి సారించాలంటూ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.



ఏలూరు జీజీహెచ్ ఎమర్జెన్సీ వార్డు వైపు సీసీ కెమెరాలు



జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ వార్డు వైపు బయట సీసీ కెమెరా



జీజీహెచ్‌లోకి వెళ్లే మార్గంలో ఉన్న సీసీ కెమెరాలు

పేరుకే కెమెరాలు

జీజీహెచ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ వాటి పనితీరు, పర్యవేక్షణ శూన్యమనే చెబుతున్నారు. ఇటీవల హాస్పిటల్‌లోని మార్చురీలో అనాథ మృతదేహాలు మాయం కాగా, అక్కడ సీసీ కెమెరాలు పనిచేయటం లేదంటూ హాస్పిటల్‌లోని డొల్లతనాన్ని బయట పెట్టారు. ఇక హాస్పిటల్‌కు వైద్యం కోసం వచ్చే రోగుల సహాయకుల మోటారు సైకిళ్ల చోరీలకు గురవుతున్నా, సీసీ కెమెరాలు ఉన్నా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటానికి కారణాలు ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. మూడు నెలల క్రితం ఎమర్జెన్సీ వార్డులో వైద్యురాలిపై కొందరు వ్యక్తులు అర్థరాత్రి 1.30 గంటలకు దౌర్జన్యానికి పాల్పడ్డారు. అధికార పార్టీ నేతల జోక్యంతో ఈ వివాదం కాస్తా సద్దుమణిగిందనే చెప్పాలి.

చర్యలు చేపట్టాలి



జీజీహెచ్‌లో భద్రత కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలి. ఇటీవల ఏలూరు నగరంలోని హాస్టల్స్‌లో బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన దారుణ ఘటనలు చోటుచేసుకున్న పరిస్థితులను చూశాం. జీజీహెచ్‌లో మెడికల్, నర్సింగ్ విద్యార్థినులు హాస్టల్స్ ఉన్నాయి. వందలాది మంది విద్యార్థినులు ఇదే ప్రాంగణంలో ఉంటున్నారు. జీజీహెచ్ ప్రాంగణంలో సరైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. దారుణాలు జరిగిన అనంతరం విచారణలు చేయటం కంటే, ముందుస్తుగా రక్షణ చర్యలు చేపట్టాలి.

– సొంగా మధు, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు

చెక్కుల అందజేత



చెక్కు అందిస్తున్న కమిషనర్ భానుప్రతాప్

ఏలూరు (టూటౌన్): ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎనిమిది మంది ఉపాధ్యాయులకు, అనారోగ్య కారణాలతో వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఒకరికి, మరణించిన ఒకరి కుటుంబ సభ్యులకు ప్రావిడెంట్ ఫండ్ రూ.39.28 లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ చాంబర్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): రెవెన్యూ సదస్సుల్లో, రీసర్వే గ్రామ సభల్లో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో వివిధ రెవెన్యూ అంశాలపై ఏలూరు డివిజన్ తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో జేసీ సమీక్షించారు. ఆర్డీఓ అచ్యుత అంబరీష్, తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.

పింగళికి భారతరత్న ఇవ్వాలి



కలెక్టర్‌కు జాతీయ జెండాను అందిస్తున్న సుభాని తదితరులు

ఏలూరు (టూటౌన్): జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారత రత్న అవార్డును ప్రకటించాలని రాష్ట్ర పతి, ప్రధాని మంత్రిలను కోరునున్నట్టు ప్రముఖ సంఘ సేవకులు, గాయకులు ఎస్ఎం సుభాని తెలిపారు. త్రివర్ణ పతాకాలను వివిధ కార్యాలయాలకు, విభిన్న స్వచ్ఛంద సంస్థలకు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. తొలుత కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ వెట్రి సెల్వికి జాతీయ జెండాను అందజేశారు. 30 ఏళ్లుగా సుభాని జాతీయ జెండాలను ఉచితంగా పంచే కార్యక్రమం, ఆట పాట పేరున మహిళలకు ఉచితంగా కుట్టుపని నేర్పించడాన్ని బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు కలెక్టర్, డీఆర్‌ఓలకు వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కలెక్టర్, డీఆర్‌ఓ, విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్ రాజు, ఉన్నతాధికారులు సుభానిని అభినందించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ జాతీయ జెండాను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. తద్వారా ప్రతి వ్యక్తికీ దేశం పట్ల భక్తి, బాధ్యత పెరుగుతాయని చెప్పారు. విశ్రాంత తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది రాజ్యాంగ 75వ వార్షికోత్సవం ఉన్నందున ప్రతిఇంటిపైనా జాతీయ జెండాను ఎగుర వేయించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు చెప్పారు. జాతీయ జెండాలను వందలాదిగా బహూకరించడానికి ప్రణాళికను సిద్ధం చేశామని పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి దివ్య అన్నారు.

హేలాపురి.. పొగమంచు కమ్మేసి

ఏలూరు నగరంలో బుధవారం ఉదయం 8.30 గంటలు దాటినా సూర్యుడి జాడ కనపడలేదు. నగరంపై పొగమంచు కమ్మేసింది. రోడ్లు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఏలూరు ప్రధాన సెంటర్ అయిన ఫైర్‌స్టేషన్ సెంటర్, కొత్త బస్టాండ్ సెంటర్, రెడ్డి కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పొగమంచుతో నిండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



రెడ్డి కాలేజీ మెయిన్ రోడ్డులో కమ్మేసిన మంచు



కొత్తబస్టాండ్ సెంటర్‌లో పొగమంచు



నగరంలోని ఓ పార్కు వద్ద కురుస్తున్న మంచు

వైఎస్సార్ సీపీ విభాగాల ఏలూరు అధ్యక్షులు వీరే

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యువజన విభాగానికి గంటా సాయి శివప్రదీప్, మహిళా విభాగానికి జిజ్జువరపు విజయనిర్మల, బీసీ సెల్‌కు కిలాడి దుర్గారావు, ఎస్సీ సెల్‌కు ఇనపనూరి జగదీష్ బాబు, ఎస్టీ సెల్‌కు దేవరకొండ నాగేశ్వరరావు, ముస్లిం మైనార్టీ సెల్‌కు ఎండీ కైసర్ పాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు మదిరి ఫ్రాన్సిస్ గ్జేవియర్ ను అధ్యక్షులుగా నియమించారు. వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడిగా యల్లావర్తుల ఎన్వీ శివరావు, విద్యార్థి విభాగానికి పాతినవలస బాల గురువేంద్ర కుమార్, మున్సిపల్ వింగ్‌కు అట్టాడ రామకృష్ణ, ఆర్‌టీఐ వింగ్‌కు పాతినవలస రాజేష్ (కరుణ), వలంటీర్స్ వింగ్‌కు ఉయ్యాల గణేష్, గ్రీవెన్స్ సెల్‌కు మద్దాల వీఎస్‌టీ ఫణి, వాణిజ్య విభాగానికి పిట్టా ధనుంజయ్‌కుమార్, వీవర్స్ వింగ్‌కు కొండపల్లి పరమేశ్వరరావు అధ్యక్షులుగా నియమించారు. అంగన్‌వాడీ వింగ్‌కు చీలి అంథోనమ్మ (బుజ్జమ్మ), లీగల్ సెల్‌కు ప్రత్తిపాటి తంబి, కల్చరల్ వింగ్‌కు మేతర సురేష్‌బాబు, సోషల్ మీడియా వింగ్‌కు పచ్చిపులుసు సృజన్, ఐటీ వింగ్‌కు పిల్లంగోళ్ల వెంకట సత్యదేవ్, దివ్యాంగుల విభాగానికి బత్తిలి నాగేశ్వరరావు, డాక్టర్స్ వింగ్‌కు కొవ్వాడ దుర్గారావు, ఇంటలెక్చువల్స్ ఫామ్స్ వింగ్‌కు లంకాబత్తిన యేసుపాదం, బూత్ కమిటీస్ వింగ్‌కు ఎచ్చెర్ల ఉమామహేశ్వరరావు, పబ్లిసిటీ వింగ్‌కు కొల్లిపర భగవాన్ కృష్ణను అధ్యక్షులుగా నియమించారు.

నేటి నుంచి నిత్య సహాయ మాత ఉత్సవాలు

దెందులూరు: పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో నేటి నుంచి మూడు రోజులపాటు నిత్య సహాయమాత ఉత్సవాలు ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలస్యం చర్చి ఫాదర్ తంబి రుంజల అన్నారు. బుధవారం పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో ఆయన మాట్లాడారు. గురువారం పాస్టర్లు రాయిరాల ప్రకాష్ రావు, అమ్మన్ రాజా ఇంజేపాల్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	04
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	22
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు – తిరుపతి	16.00	4830	32
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు–బీహెచ్ఈఎల్	22.30	98502	00

ఉత్సాహంగా క్రీడా సంబరాలు



క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఏలూరు జోన్ ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో ఈ క్రీడా సంబరాలను అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీ నిర్వహించి ప్రారంభించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే దిశగా అపుస్మా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అపుస్మా ఏలూరు జోన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జోన్ పరిధిలోని 30 ప్రైవేట్ పాఠశాలల నుంచి రెండు వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నట్టు చెప్పారు. ఈ పోటీలు గురువారం కూడా కొనసాగుతాయని, విజేతలకు బహుమతులను ప్రముఖుల ద్వారా ప్రదానం చేస్తామని చెప్పారు. అపుస్మా జోనల్ కార్యదర్శి బీజే సతీష్, అపుస్మా రీజనల్ అధ్యక్షుడు గుణ్ణం బుల్లబ్బాయి, ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్ నతానియేలు, కె.చంద్ర శేఖర్, కడియాల విజయలక్ష్మి, ఎస్ఆర్‌కే ప్రసాద్, కె.వినోద్, జి.రవిశంకర్, వై.రాజా ప్రతాప్, ఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోబీ ఘాట్ల మోటార్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్న రజక సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గతంలో టీడీపీ హయాంలో రజక వృత్తిదారులకు రజక చెరువుల వద్ద మోటారు బోర్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ఇచ్చిన జీఓలను అమలు చేయాలని రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక విద్యుత్ భవనంలో బుధవారం ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్‌ను కలిసి దోబీ ఘాట్లకు ట్రాన్స్‌కో సీఎండీ, ఈపీడీసీఎల్ సీఎండీ ఆదేశాల ప్రకారం సహకరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఈఈలను కలిసి జీఓ 75 అమలయ్యేలా కోరనున్నట్టు కట్లయ్య తెలిపారు. గతంలో అంబేద్కర్ జంగారెడ్డిగూడెంలో ఈఈగా పనిచేసిన సమయంలో కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడు తదితర గ్రామాల్లో జీఓ అమలయ్యేలా చర్యలు తీసుకోవడంతో రజకులు లబ్ధి పొందారని గుర్తు చేశారు. త్వరలో భీమవరం, నిడదవోలు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ అధికారులను కలిసి ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ఈ సందర్భంగా ఈఈ అంబేద్కర్ మాట్లాడుతూ రజకుల విషయంలో దోబీ ఘాట్ల వద్ద మోటార్లకు ఉచిత విద్యుత్ సరఫరాకు పూర్తి సహకారాలు అందిస్తానని తెలిపారు.

పామాయిల్ కార్మికులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): పామాయిల్ తోటల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. బుధవారం మధ్యాహ్నం ముందూరు గ్రామంలో బుడపన సింహాచలం కుమారుడు శ్రీను తాడిచెట్టుపై ఆకుల కోస్తుండగా అదుపుతప్పి అతని గెడ విద్యుత్ తీగలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రెండు మూడు నెలల కాలంలో సుమారు ఐదుగురు కార్మికులు చనిపోయారని తెలిపారు. ఈ కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, పామాయిల్ కార్మిక సంఘం అండగా ఉంటుందని చెప్పారు. పామాయిల్ తోటలో పనిచేస్తూ విద్యుత్ షాక్ తగిలి మృత్యువాత పడుతున్న కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం లేదా విద్యుత్ శాఖ లేదా ఉద్యానవన శాఖల నుంచి పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు చనిపోయిన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీసం స్పందించడంలేదని వాపోయారు. జిల్లా అధికారులు, కలెక్టర్ కలుగజేసుకొని పామాయిల్, వ్యవసాయ కార్మికుల మరణాలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరారు.

40 బారికేడ్లు అందజేత



ఎస్పీ శివకిషోర్ సమక్షంలో ట్రాఫిక్ బారికేడ్ల అందజేత

ఏలూరు టౌన్: రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఆశ్రం హాస్పిటల్స్ డైరెక్టర్ గోకరాజు రతీదేవి, యాజమాన్యం ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు 40 ట్రాఫిక్ నియంత్రణ బారికేడ్లను అందజేశారు. ఆశ్రం కాలేజీలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చేతులమీదుగా బారికేడ్లను అందజేశారు. రహదారి ప్రమాదాలను నివారణ, వాహన వేగ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఏలూరు నగరంలోనూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ వాహనాల వేగాన్ని తగ్గించేందుకు బారికేడ్లు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వేగం కంటే ప్రాణం మిన్న అనే ఆలోచనతో ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు జి.సత్యనారాయణ, వైవీ రమణ, కోటేశ్వరరావు, రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ఆశ్రం హాస్పిటల్ యాజమాన్యం ఉన్నారు.